www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 21 నవంబర్ 2022
5
తిరుపతి

డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన

గంథాలయ వారోత్సవాల ముగింపు సభలో ఎంపి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నవంబర్ 20న జాతీయ గ్రంథాలయ వారోస్తావాల ముగింపు సభ ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నైనారు మధుబాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తిరుపతి ఎంపి ఎం.గురుమూర్తి, తహశీల్దార్ కె.వెంకటరమణ, ఆర్ఐ రామచంద్రయ్య, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రత్నప్రభ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ సమాజంలో గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే డిజిల్ గ్రంథాలయాలపై అవగాహన కల్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు నైనారు మధుబాల, కార్యదర్శి (యఫ్ఎసి) జె.శివప్రసాద్, గ్రంథాలయాధికారి ధనంజయులు పాల్గొన్నారు.

కోవిడ్ ఉద్యోగులకు జీతాలేవీ..

ఆరు నెలలుగా నిరీక్షణ..

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి వైద్యశాఖలో విధులు నిర్వర్తించిన ఒప్పంద ఉద్యోగులకు వేతనాలు విడుదల చేయడంలో రాష్ట్రప్రభుత్వం తీవ్రజాప్యం చేస్తోంది. విధుల నుంచి తొలగించి ఆరునెలలు అవుతున్నప్పటికీ ఇంతవరకు వేతనాలు ఇవ్వకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. పేద నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉన్నట్లు బాధితులు వాపోతున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలాఉన్నాయి.

దేశవ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి విజంభించిన వేళ.. కోవిడ్ బాధితులకు వైద్యసేవలు అందించడానికి ఆరునెలల ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగులను నియమించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ విభాగం వారు గత ఏడాది మే మాసంలో నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో భాగంగా తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో వీఆర్ డీఎల్ విభాగంలో 36 మంది ఉద్యోగులను నియమించుకున్నారు. ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, రీసెర్చ్ సెంటిస్టులున్నారు. వీరికి విభాగాల వారీగా వేతనాలు నిర్ణయించారు. ఆరు నెలలకు వీరి ఉద్యోగగడువు ముగియడంతో మరో ఆరునెలలు పొడిగించారు. అంటే వీరి వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాటు సేవలు చేయించుకుంది. కోవిడ్ వేళ ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిన వీరికి సకాలంలో వేతనాలు చెల్లించలేదు. అయినా వీరు అలాగే విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. కొవిడ్ తగ్గుముఖం పట్టడంతో వీరిని ఉద్యోగాల నుంచి తొలగించారు. వీరిలో కొందరికి మేనెలలో... మరికొందరికి జూలైలో గడువు ముగిసింది. స్విమ్స్ వీఆర్ డీఎల్ విభాగంలో విధులు నిర్వర్తించిన 36మందికి రూ.45,26,988లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

వీరికి ఒక్కొక్కరికి సగటున నాలుగు నెలల వేతనం ప్రభుత్వం బకాయి ఉంది. వీరి ఉద్యోగగడువు ముగిసి ఆరుమాసాలు అవుతున్నప్పటికీ రాష్ట్రప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ప్రభుత్వం వేతనాలు విడుదల చేయకపోవడంతో కోవిడ్ వేళ విధులు నిర్వర్తించిన 36మంది ఉద్యోగులు ఈఏడాది ఆగస్టు 29న 'స్పందన'లో తిరుపతి జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీకి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్పందించి స్విమ్స్ అధికారులతో మాట్లాడారు. తమవంతు ప్రయత్నం తాము చేస్తున్నామని, ప్రభుత్వానికి లేఖరాసినా నిధులు విడుదల చేయలేదని వారు సమాధానం ఇచ్చారు. దీంతో ఆయన ఈ విషయం ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయినా వీరి సమస్య ఇంతవరకు పరిష్కారం కాలేదు. తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి తమ వేతనాలు విడుదల చేయాలని వారు వేడుకుంటున్నారు.

ప్రజాఉద్యమాలపై నిర్బంధం

సిఐటియు రాష్ట్ర సదస్సులో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాల గౌడ

సదస్సులో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాల గౌడ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హక్కును ఉల్లంఘిస్తే పోలీసులైనా, ఉన్నతాధికారులైనా జైలుకెళ్లక తప్పదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాల గౌడ అన్నారు. ఆదివారం నాటి ఉదయం తిరుపతి నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో సిఐటియు, ఎంబివికె ఆధ్వర్యంలో నందూరి ప్రసాదరావు స్మారక సెమినార్‌ను నిర్వహించారు. 'ప్రజా ఉద్యమాలు... నిర్బంధం' అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోపాలగౌడ కీలక ప్రసంగం చేశారు. 200 సంవత్సరాలపాటు బ్రిటిష్ వారి నియంతత్వంలో నలిగిపోయిన భారతీయులు అనేక పోరాటాల ఫలితంగా స్వాతంత్ర్యం పొందారని గుర్తు చేశారు. ఈ స్వాతంత్ర్య పోరాటాల ఫలితమే మన రాజ్యాంగమని రాజ్యాంగం అనేక హక్కులను దేశప్రజలకు కల్పించిందని అందులో భావప్రకటనా స్వేచ్ఛ, ప్రశ్నించే హక్కు, నిరసన తెలిపే హక్కులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తిరుపతి నగరంలోను, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పోలీసులు అనుసరిస్తున్న తీరు అమానవీయంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సదస్సు ప్రారంభానికి ముందు ఆయన సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను తిలకించినట్టు తెలిపారు. తిరుపతిలోని సిఐటియు నాయకుల గహాలను, కార్యాలయాన్ని దిగ్బంధించిన తీరును తీవ్రంగా తప్పుపట్టారు. మాజీ పార్లమెంట్ సభ్యులు మధు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ పట్ల పోలీసులు తిరుపతిలో వ్యవహరించిన తీరు అమానుషంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు, ప్రజాప్రతినిధులు, అందరూ స్వాతంత్ర పోరాటఫలాన్ని అనుభవిస్తున్నారని ఆ కారణంగానే ఆ పదవుల్లో కొనసాగుతున్నారని ఈ విషయం గుర్తుండకపోతే అర్థం లేదన్నారు. స్వాతంత్ర్య ఫలాల కారకులు కార్మికులేనని ఈసందర్భంగా గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పోలీసుల ద్వారా కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ, ఆశాలు మధ్యాహ్నం భోజన కార్మికులు, టిటిడి తదితర కార్మికుల మీద సాగిస్తున్న పైశాచిక దాడిని తీవ్రంగా తప్పుపట్టారు. కార్మికశక్తి లేకుంటే దేశాభివద్ధి లేదని విశదీకరించారు. కార్మికులే లేకుంటే ఉత్పత్తి లేదని, ఉత్పత్తి లేకుంటే ప్రజల అవసరాలు తీర్చే వారు ఎవరని? ప్రశ్నించారు. కార్మికులే లేకపోతే వ్యవస్థలో ఏ శక్తులకు స్థానం ఉండదని ఈ పరిస్థితిని గుర్తుంచుకోకుండా.. పోలీసులు, ఉన్నతాధికారులు వ్యవహరించడం అధర్మమని విరుచుకుపడ్డారు. ఏపీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రంలోని పలుప్రాంతాలలో అప్రజాస్వామికంగా వ్యవహరించడం సమంజసంగా లేదని, మహిళల పట్ల సాగిస్తున్న దౌర్జన్యం దారుణమని, టీటీడీ అటవీ కార్మికులు రెండేళ్లుగా నిరాహార దీక్షలు చేస్తుంటే పట్టించుకోకపోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను అపహాస్యం చేయవద్దని, రాజ్యాంగ హక్కులను కాపాడే బాధ్యత శాసన వ్యవస్థకు ఉందని అన్నారు.

ప్రజాస్వామ్య ప్రక్రియ సమంగా నడవటానికి నాలుగు కీలకంగాలుగా ఉన్న వ్యవస్థలు పట్టించుకోవాలని సూచించారు. పోలీసులు సాగిస్తున్న దౌర్జన్యాలు, పెడుతున్న అక్రమ కేసులపై తీవ్రంగా స్పందించాలని ప్రజాస్వామ్యశక్తులకు, లాయర్లకు సూచించారు. కార్మిక కార్యాలయాల చుట్టూ, నాయకుల ఇళ్ల చుట్టూ పోలీసులు మోహరించడం, అడ్డుకోవడం, గహనిర్బంధాలు గావించడం... మానవహక్కుల ఉల్లంఘనే అని ఆయన అన్నారు. జాతీయ మానవహక్కుల కమిషన్‌కి, రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కి ఫిర్యాదు చేయాలని సూచించారు. రాష్ట్ర హైకోర్టు పరిధిలో పోలీస్ అథారిటీ అనే వ్యవస్థ ఉంటుందని దానికి రిటైర్డ్ హైకోర్టు జడ్జి నేతత్వం వహిస్తాడని పోలీస్ అథారిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. మానవహక్కుల కమిషన్లు పట్టించుకోని పక్షంలో హైకోర్టును ఆశ్రయించాలని సూచించారు. బార్ కౌన్సిల్, లాయర్లు ఇతర న్యాయకోవిదులు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా గళం విప్పాల్సిన అవసరం ఉందని, కార్మిక వర్గానికి అండగా నిలబడాలని ఆయన సూచించారు. తిరుపతిలో జరిగిన సదస్సుకు అన్ని కార్మిక సంఘాలు హాజరు కావడం శుభపరిణామమని, ఈపరిస్థితిని కలిసికట్టుగా ఎదుర్కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందుకు అవసరమైన సహకారాన్ని అన్ని స్థాయిలలో అందివ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కోవడానికి తానే స్వయంగా పిటిషన్లు తయారు చేయడానికి కూడా సన్నద్ధంగా ఉన్నానని, అవసరమైతే సుప్రీంకోర్టులో సీనియర్ లాయర్లను తాను ఏర్పాటు చేస్తానని, హైకోర్టులో సైతం అవసరమైన న్యాయసహాయాన్ని అందించడానికి తాను సంసిద్ధంగా ఉన్నానని కార్మికుల హర్షధ్వానాల మధ్య ఆయన ప్రకటించారు.

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు ప్రసంగిస్తూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కార్మిక వర్గంపై సాగిస్తున్న ఉద్యమాలపట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని, ఇందులో మహిళలను కూడా విడిచిపెట్టడం లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. రానున్న రోజుల్లో ఐక్యఉద్యమాలు నిర్మిస్తామని కేవలం కార్మిక వర్గమే కాకుండా రైతులను, వ్యవసాయ కూలీలను కలుపుకొని పెద్దఎత్తున ఈపోరాటాలు తీవ్రతరం చేస్తామని ప్రకటించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సాగించిన ధమనకాండను ఈ సందర్భంగా సభ దష్టికి నర్సింగ్ రావు తీసుకొచ్చారు. సమస్యలను ప్రశ్నిస్తుంటే పరిష్కారానికి చొరవ చూపాల్సిన ప్రభుత్వం నోరెత్తకుండా లాఠీలను ఝుళిపించడం దారుణమని విమర్శించారు. సదస్సులో తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.దినకర్, ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకష్ణ, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి జిల్లా ఆర్.హరికష్ణ, ఐఎన్‌టియుసి అధ్యక్షులు లేబూరి రత్నకుమార్, టిఎన్‌టియుసి జిల్లానేత ఆముదాల తులసీకుమార్, ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి సత్తార్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.వాణిశ్రీ, ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రబాబు, కెవన్ ఎన్.ప్రసాదరావు, ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు పోరాటాల ఎగ్జిబిషన్‌లో గోపాల గౌడ

నైటింగేల్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత
పద్మజ మునస్వామికి సన్మానం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: 2020 సంవత్సరానికి నైటింగేల్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ పద్మజ మునస్వామిని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి.గోపాల గౌడ ఘనంగా సన్మానించారు. స్థానిక ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్‌లో సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న సదస్సు సందర్భంగా ఆమె సేవలను గుర్తించి గోపాల్ గౌడ సన్మానించారు. పద్మజ వైద్యరంగంలో నర్సింగ్ సేవల విషయంలో అద్భుతమైన ప్రతిభను కనబరిచారని, ట్రైబల్ ఏరియాలలో కషి చేశారన్నారు. ఇప్పటికే వైద్యసంబంధమైన నాలుగు గ్రంథాలను రచించారని, క్యాన్సర్ కారక సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారని, 170మందికి అవగాహన కల్పించి అవయవ దానానికి స్విమ్స్ ఆసుపత్రికి ఆమోదం ఇప్పించారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కందారపు మురళి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు, వివిధ ట్రేడ్ యూనియన్ల నేతలు, పలువురు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఎస్‌జిఎస్'లో ఇంటర్న్‌షిప్ ప్రారంభం

కౌటిల్య విద్యాసంస్థతో ఎస్‌జిఎస్ కళాశాల అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో శ్రీగోవిందరాజ స్వామి డిగ్రీ కళాశాలలో డిగ్రీ తతీయ సంవత్సరం విద్యార్థులకు మూడు నెలల ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ప్రారంభమైందని ఇందులో భాగంగా విద్యార్థులు కళాశాలలో ఇంటర్న్‌షిప్ ప్రారంభించడం జరిగిందని ప్రిన్సిపల్ ఎన్.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 19వ తేదీ నుంచి ఇంటర్న్షిప్ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పరిశ్రమలకు అవసరాలకు తగినట్లుగా ఆధునిక అంశాలైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజిటల్ మార్కెటింగ్, మానవ వనరుల నిర్వహణ, కేస్ స్టడీ, ప్రాజెక్ట్ నిర్వహణ, కార్పొరేట్ నైపుణ్యాలు, మార్కెటింగ్ విధానాలు, నవ కల్పన, వ్యవస్థాపకత, భావవ్యక్తీకరణ, నైపుణ్యాలు, ఇంగ్లీష్ భాషలో పట్టు వంటి అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని వివరించారు. నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు అనుగుణంగా డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి అని వెల్లడించారు. ఇందులో భాగంగా కౌటిల్య విద్యాసంస్థతో అవగాహన ఒప్పందం కూర్చున్నామని తద్వారా పరిశ్రమ నేర్పుణలచే శిక్షణ, పని అనుభవం విద్యార్థులకు నేర్పించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా విద్యార్థుల డిగ్రీ పూర్తి అయిన వెంటనే కంపెనీలలో వాస్తవ పరిస్థితిని వాతావరణాన్ని పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని అందుకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. కౌటిల్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో పైకి ఎదగాలంటే పట్టుదల, కషి, ఆసక్తి, నేర్చుకోవాలని కోరిక, జిజ్ఞాస తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. నేటి ఆధునిక ప్రపంచంలో సరికొత్త సబ్జెక్టులు అయినా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లెర్నింగ్, బిజినెస్ అనలైటిక్స్ వంటి వాటిపై చక్కని పరిజ్ఞానం విద్యార్థులకు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ కంపెనీ సీనియర్ మేనేజర్లు ఎంఎస్.రెడ్డి, కళాశాల అధ్యాపకులు, ఇంటర్న్‌షిప్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

శ్రీపద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు
ధ్వజారోహణంతో ప్రారంభం

ప్రజాశక్తి- తిరుచానూరు: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి పట్టపుదేవేరి అయిన తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఆదివారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉదయం 9.30నుండి 9.45గంటల మధ్య వేదమంత్రోచ్చారణ మధ్య ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి సుప్రభాతం నిర్వహించారు. ఇదే సమయంలో యాగశాలలో గజపట ప్రతిష్ట చేపట్టారు. గజ ప్రతిష్టలో భాగంగా గజధ్యాన శ్లోకం, గజ మంగళాష్టకం, గరుడ గద్యం వల్లించి అపరాధ క్షమాపణం కోరారు. ఈ గరుడ గద్యం ప్రస్తావన కాశ్యప సంహితలో ఉంది. ఈ సందర్భంగా రక్షాబంధనం, ఛాయాధివాసం, ఛాయా స్నపనం, నేత్రోల్మీనలనం, తత్వన్యాస హోమం, ప్రాణప్రతిష్ట హోమం, పూర్ణాహుతి చేపట్టారు. ఆ తరువాత గజపటాన్ని ధ్వజారోహణ మంటపానికి తీసుకొచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సిఎం

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి టిటిడి జెఈవో వీరబ్రహ్మం, ఆలయ అర్చకులు, అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తన పూర్వజన్మ సుకతంగా భావిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డికి కతజ్ఞతలు తెలియజేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు టిటిడి విస్తతస్థాయిలో ఏర్పాట్లు చేసిందన్నారు. రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం ఏఈవో ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ పద్మావతీ అమ్మవారి బ్రహోత్సవాలు సందర్భంగా అమ్మవారికి చెన్నైకు చెందిన హిందూ మహాసభ ట్రస్ట్ చైర్మెన్ వీర్ వసంత కుమార్ రెండు పెద్ద గొడుగులు, రెండు చిన్నగొడుగులను సమర్పించారు. అమ్మవారికి గొడుగులు సమర్పించిన దాతకు ఆలయ అర్చకులు, అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దర్శనాంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చిన్న శేషుడిపై గోపాల కృష్ణుడుగా పద్మావతిదేవి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజున ఆదివారం రాత్రి అమ్మవారు చిన్నశేషవాహనంపై గోపాల కృష్ణుడు అలంకరణలో భక్తులను కటాక్షించారు. అమ్మవారికి ఉదయం నిత్యకైంకర్యాలు, మధ్యాహ్నం 12:30 నుంచి గంటలకు శ్రీకష్ణ స్వామి ముఖమండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం చిన్నశేషవాహన సేవ తిరుమడ వీధులలో భక్తులకు వైభవంగా దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో జెఈవో వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఏవిఎస్ఓ శైలేంద్ర బాబు, పాంచరాత్ర ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు బాబు స్వామి, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ మధుసూదన్, ఆలయ ఇన్స్పెక్టర్లు దాము, ప్రసాద్ అశోక్ ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తిరుచానూరు ప్రదర్శనశాలను ప్రారంభించిన టీటీడీ ఈవో

శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా తిరుచానూరులోని శుక్రవారం తోటలో ఏర్పాటుచేసిన వివిధ ప్రదర్శనశాలలను ఆదివారం టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డి ప్రారంభించారు. కూరగాయలతో రూపొందించిన దేవతామూర్తులు మండపం చామంతి రోజాలు పెట్రోనియా బిగోనియా స్వాలియా తదితర జాతులు రంగురంగుల పూల మొక్కలుపూలతో రూపొందించిన ఏనుగు రథం కోలాపూర్ నందు వెలసిన శ్రీమహాలక్ష్మి అమ్మవారు తదితర అకతుల ఆకట్టుకుంటున్నాయి. అదేవిధంగా ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో ఆధ్వర్యంలో ఆయుర్వేద ప్రదర్శనశాల ఫార్మసీ వనమాలిక పిరమిడ్ శిక్షావల్ సొసైటీ వారి కలిగే లాభాలపై ప్రదర్శన ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం డిప్యూటీవో లోకనాథం, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, మేనేజర్ సి.జనార్ధన్ రెడ్డి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నూతన డీఎస్పీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- నాయుడుపేట: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలోని నాయుడుపేట పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం పక్కన నూతనంగా డీఎస్పీ కార్యాలయాన్ని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు కిలివేటి సంజీవయ్యల చేతుల మీదగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. నాయుడుపేట డివిజన్ నూతన డిఎస్పిగా నియమితులైన రాజగోపాల్ రెడ్డికి ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, ఎన్డీసిసి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, పట్టణ సిఐ సిహెచ్.ప్రభాకర్ రావు, రూరల్ సీఐ వై.సోమయ్య, నాయుడుపేట ఎస్ఐ కిష్టయ్య, పెళ్లకూరు ఎస్ఐ మనోజ్ కుమార్, డివి సత్రం ఎస్ఐ తిరుమలరావు, ఓజిలి ఎస్ఐ ఆదిలక్ష్మి, నాయుడుపేట ఎక్సైజ్ సీఐ ఆర్వియూ ఎస్ ప్రసాద్, మరి కొంతమంది పోలీసు సిబ్బంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన డిఎస్పికి శుభాకాంక్షలు తెలియజేశారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

1983 -84 10వ తరగతి బ్యాచ్ కలయిక

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక తిరుపతి నగరంలో జరిగింది. 38 సంవత్సరాల తర్వాత పదవ తరగతి చదువుకున్న విద్యార్థులంతా తిరుపతి నగరంలో కలుసుకున్నారు. ఉపాధ్యాయనగర్‌లోని లోటస్ ఫంక్షన్ హాల్ దీనికి వేదిక అయింది. 38ఏళ్ల తర్వాత దేశం నలుమూలల నుంచి తిరుపతి నగరానికి మిత్రులను కలుసుకోవటానికి పూర్వవిద్యార్థులు తరలివచ్చారు. ఇందులో డాక్టర్లు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులు, ఆటో డ్రైవర్ నుంచి ఆటోమొబైల్ ఇంజనీర్ వరకు ఉన్నారు. అనేక మంది ఒకచోట కలుసుకోవడం తమకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని, పాతస్మతులను నెమరు వేసుకున్నామని ఆనందంగా వీరంతా చెప్పుకొచ్చారు. 38 ఏళ్ల కాలంలో కనుమూసిన వారు, దూరమైన వారి గురించి తలుచుకొని దుఃఖించి వారికి నివాళులర్పించారు. పదవ తరగతి తరువాత మొదటిసారి కలుసుకున్న వారు ఉద్వేగానికి గురయ్యారు. మున్సిపల్ రెవెన్యూ అధికారి కేఎల్ వర్మ, సిపిఎం నేత కందారపు మురళి, అర్జున్, ఆర్ఆర్ శ్రీనివాసులు, సుబ్బారావు, జయచంద్ర, సురేంద్ర, చెంగయ్య తదితరులు ఈ కార్యక్రమానికి నేతత్వం వహించారు. ఉదయం 10గంటలకే కార్యక్రమ స్థలికి చేరుకున్న మిత్రులు మధ్యాహ్నం మూడు గంటల వరకు ఆట పాటలు, జోకులు, డాన్సులు, ప్రసంగాలు, ఒకరిపై మరొకరు చెణుకులు విసురుకుంటూ హుషారుగా గడిపారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, తిరుపతి నగరంలోని గాయకులు ప్రముఖ కళాకారుడు శాంబోలు హరినాథ్ హాస్యవల్లరితో ఆద్యంతం హుషారుగా కార్యక్రమాలు సాగాయి. తామంతా కలిసికట్టుగా ఉంటామని మళ్లీమళ్లీ ఇలాంటి కార్యక్రమాలు జరుపుకోవాలని బాసలు చేసుకున్నారు. ఈ కార్యక్రమం మొత్తాన్ని మున్సిపల్ రెవెన్యూ అధికారి కేఎల్ వర్మ యాంకరింగ్‌తో రక్తి కట్టించారు.

వైసీపీ వర్సస్ జనసేన 'ఓపెన్ ఛాలెంజ్'

- 30 యాక్ట్ ప్రయోగించిన పోలీసులు - జనసేన వినుత ఇంటి వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: అధికార పార్టీ వైసిపి, ప్రతిపక్షం జనసేన మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో జరుగుతున్న అవకతవకలపై పెళ్లి మండపం వద్దకు ఆదివారం బహిరంగ చర్చకు రావాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వినుత కోట శనివారం రాత్రి సవాలు విసరగా అందుకు ప్రతిగా అధికార పార్టీ నాయకులు కూడా చర్చకు సిద్ధమంటూ సవాలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి పోలీసులు బహిరంగ చర్చకు అనుమతి లేదంటూ ఇరువురికి 30 నోటీసులు అందించారు. ఆదివారం ఉదయం వినుత ఇంటి వద్ద పోలీసులను మోహరించారు. అక్కడకు జనసేన నాయకులు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా వినుత మాట్లాడుతూ తాము బయటకు వచ్చి నిరసన తెలపాలన్నా, బహిరంగ చర్చకు పోవాలన్న పోలీసులకు 30 యాక్ట్ గుర్తొస్తోందనీ, మరి మూడు రోజుల కిందట స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పెద్ద ఎత్తున ర్యాలీ చేపడితే గుర్తుకు రాలేదా అంటూ ఎద్దేవా చేశారు. కేవలం జనసేనకు మాత్రమే 30 యాక్టు వర్తిస్తుందా అంటూ మండిపడ్డారు. ఇళ్ళ నిర్మాణాల్లో అవకతవకలు ఉంటే నిరూపించాలని పవన్ కళ్యాణ్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మరి ఇపుడేందుకో దొడ్డి దారిన పోలీసులను అడ్డు పెట్టుకుని తప్పించుకుంటున్నారని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలు అన్నీ గమనిస్తున్నారనీ, రానున్న ఎన్నికల్లో తగిన పాఠం చెబుతారని హెచ్చరించారు.

కెవిపిఎస్ మహాసభను జయప్రదం చేయండి

జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్ రావు

సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు

ప్రజాశక్తి - పాకాల: శ్రీకాళహస్తిలో సోమవారం కె.వి.పి.ఎస్ జిల్లా జరుగు మహాసభను జయప్రదం చేయాలని కె.వి.పి.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్ రావు పిలు పునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపాన జిల్లా కేవీపీఎస్ ఉపాధ్యక్షుడు మధుసూదన్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు నివారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ పాకాల మండల అధ్యక్షుడు నరేంద్ర, మహిళా కన్వీనర్ కుమారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విశ్వం విద్యార్థులు..

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు నిర్వహించిన 30వ నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్ట్ కాంపిటీషన్లో తిరుపతి విశ్వం విద్యా సంస్థల విద్యార్థులు ఎ.కరణ్, అయాన్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్ట్ కాంపిటీషన్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా శాఖ అధికారి శేఖర్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ యన్.విశ్వ నాథ్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువులతోపాటు క్రీడలు, ఇతర రంగాల్లో రాణించడం ముఖ్యంగా తమ విద్యాసంస్థల విద్యార్థులు రాణించడం పట్ల ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో తులసి, విశ్వచందన్ రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆ కులాలను ఎస్టీల్లో చేర్చొద్దు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వాల్మీకి, బోయ, బెంతు, ఒరియా, బీసీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చారాదని, యానాది కుల ఉద్యోగస్తుల సంఘం, యానాదుల కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఆదివారం యానాది కుల సంఘాలు, ఉద్యోగస్తుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యానాది జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా చందమామల కోటయ్యను, ప్రధాన కార్యదర్శిగా పల్లమాల గోపి, ఉపాధ్యక్షుడిగా దశరధ రామయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జీవో నెంబర్ 52 రద్దు కోసం పోరాడేందుకు సిద్ధం కావాలని తీర్మానించారు.

'పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 25, 26వ తేదీల్లో ఢిల్లీ వేదికగా తలపెట్టబోతున్న పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ నియోజవర్గ కార్యదర్శి మల్లికార్జున్ పిలుపునిచ్చారు. స్థానిక సమీకృత బాలుర వసతి గృహం ఆవరణలో చలో పార్లమెంట్ మార్చ్ గోడపత్రికలను నాయకులు ఆవిష్కరించారు. సిపిఐ నియోజవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ నూతన విద్యా విధానంతో బిజెపి ప్రభుత్వం విద్యార్థుల్లో ఆర్ఎస్ఎస్ వాదాన్ని బలవంతంగా జొప్పించే ప్రయత్నం చేస్తోందనీ, దాన్ని తిప్పుకొట్టాలని గురవయ్య పిలుపునిచ్చారు. సురేష్, గోపి, ఆది తదితరులు పాల్గొన్నారు.

దేశభవిష్యత్తుకు యువతే కీలకం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: దేశ భవిష్యత్తుకు యువతే కీలకమని టిఎన్‌టియుసి మాధవ నాయుడు అన్నారు. ఆదివారం పుత్తూరు మున్సిపాలిటీ 22వ వార్డులో జరిగిన ఓటర్ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకొని దేశభవిష్యత్తుకు ఉపయోగపడే మంచి నాయకులను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోవాలని తెలిపారు. 76వ బూత్ బిఎల్ఓ హేమంతని కలసి కొత్త ఓటర్ల నమోదుకు సహకరించవల సిందిగా కోరారు. కన్నన్, సుబ్రహ్మణ్యం నాయుడు మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాజాఫీర్, మురళి, వెంకటేశ్వర్లు, యువతీ, యువకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పొణకా ఆదిశేషారెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుమారుడు పొణకా మల్లికార్జున రెడ్డి పూర్తి సహకారంతో ఫలసరుకులు పంపిణీ చేశారు. ఆదివారం బాలాజీ నగర్‌లోని ప్రగతి కార్యాలయంలో "కార్తీకమాసం" సందర్భంగా నిరుపేదలైన 15 కుటుంబాలకు "18 రకాల పలసరుకులు", మహిళలకు చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, పొణకా మల్లికార్జున రెడ్డి, సురేంద్ర, కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహన్ రావు, పి.డి. కరిముల్లా, ప్రజేంద్ర రెడ్డి, మామడూరు రాధయ్య, కేఆర్ఎం, వాచ్ షాప్ రాము, పిల్లిల శీను, కోట వెంకటేశ్వర్లు, కృష్ణా రెడ్డి, సివిఆర్ న్యూస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మండల పరిధిలోని వేలుకాడు హరిజనవాడలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, పాలెంపాడు ఎస్సీకాలనీ(అరుంధతి వాడ)లో శ్రీమాత పరమేశ్వరి దేవాలయానికి ఆదివారం తిరుమల తిరుపతిదేవస్థానం (శ్రీవాణి ట్రస్ట్) వారి ఆర్థిక సాయంతో సమరసత సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణానికి భూమి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తడ సబ్ డివిజన్ కన్వీనర్ సుదర్శన్ రెడ్డి, తడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ మునికృష్ణ రెడ్డి, దొరవారి సత్రం మండలం కన్వీనర్ సగిలాల రమణయ్య, తడ మండలం కన్వీనర్ శారదమ్మ, సహా కన్వీనర్ శృతి నక్షత్రలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆలయ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

పంచాయతీలలో పడకేసిన పారిశుధ్యం

- మురికి కూపాలుగా డ్రైనేజీ కాలువలు
- ఆందోళనలో గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: మండలంలోని పలు పంచాయతీలలో పారిశుధ్యం పడకేసింది. మండలంలోని దివిపాలెం, బెల్దర్ కాలనీ, విందురు, చెంబడి పాలెం, పురిటీ పాలెం, తదితర గ్రామాల్లోని

మురికి కూపాలుగా డ్రైనేజీ కాలువలు

పురవీధులు మురికి కూపాలను తలపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధికారులు, పాలకులు దృష్టి సారించడంలేదు. అంతర్గత వీధులు, డ్రైనేజీలు, కాలుష్యపు నీటి మధ్యనే ఉంటున్నాయి. దీంతో ప్రజలు అంటు రోగాలకు గురవుతున్నారు. ఇదివరకు ప్రభుత్వం ఉపాధి పనుల ద్వారా చేపట్టిన అంతర్గత గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులు నాసిరకంగా జరగడంతో మూన్నాళ్ళ ముచ్చటగా తయారై వర్షాలకు కరిగిపోయి అడుగు పెట్టలేని దీన పరిస్థితి నెలకొంది. ఈ గ్రామాలలో డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్ళముందు మురుగు కాలువల నీరు దర్శన మిస్తున్నాయి. పలుమార్లు మురుగును తొలగించాలని అధికార్లకు విన్నవించుకొన్న, పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలవలన మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఓవర్ హెడ్ ట్యాంకులు సైతం శుభ్రపరచి ఏడాది పైన అవుతుందని పలువురు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పారిశుధ్యంపై దృష్టి సారించి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో ఉంటూ పనిచేస్తాం : హౌసింగ్ డీఈ



ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

ప్రజాశక్తి -బాలాయపల్లి: హౌసింగ్ శాఖ అధికారులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేయడం జరుగుతుందని హౌసింగ్ డీఈ సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని మన్నూరు మిట్ట అలిమిలి గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ దివాస్ పథకం ద్వారా మంజూరైన పక్క గృహాలు ఎంపీడీవో వినిల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్క గృహాలు మంజూరైన ప్రతి ఒక్కరూ పూర్తి చేయాలని కోరారు.

100శాతం పూర్తి చేస్తాం:మస్తాన్

పేదలకు మంజూరైన పక్కా గృహాల పనులను 100శాతం ధృవీకరణ పూర్తి చేసేందుకు తమ వంతు సాయం అందించడం జరుగుతుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ప్రజాసంఘాల నాయకుడు చెన్నూరు మస్తాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా గృహాలు లేక పేదలు ఎన్నో కష్టాలు పడుతుంటే ప్రభుత్వం కొంతమేరకు చేయూతనందించి పేదల పక్కా గృహాల కలను నెరవేర్చేందుకు తాము ఎల్లవేళలా ముందుండి శక్తివంచన లేకుండా పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ పెంచలయ్య, సచివాలయ సిబ్బంది చెన్నూరు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

పిల్లల దినోత్సవం పురస్కరించుకొని ఎస్టీ బాలుర వసతి గృహంలో సమావేశంలో ప్రసంగిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సీనియర్ న్యాయవాదులు మోడీ సంజీవి, మురుగేషన్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ పిల్లల దినోత్సవం సందర్భంగా పుత్తూరు ఇన్‌ఛార్జి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవ అధికారి సంస్థ అధ్యక్షులు శిరీష్ ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌టి బాలుర వసతి గృహంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో పుత్తూరు సీనియర్ న్యాయవాదులు ఎం.సంజీవి, మురుగేషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వం విద్యాహక్కు చట్టం ద్వారా పేద పిల్లలందరికీ ఉచిత విద్యను అందిస్తున్నారని ప్రభుత్వం అందించే సదుపాయాలను పిల్లలు ఉపయోగించుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. 14 సంవత్సరాలు లోపు పిల్లలను పనికి ఉంచరాదని వెట్టి చాకిరి, బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించాలని బాల్యవివాహాలను నిర్మూలించాలని పిల్లలు హక్కులను తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్, మునిరత్నం, ఉపాధ్యాయుడు, శేఖర్ పాల్గొన్నారు.

రైతు సంఘాల ఏర్పాటుతో అభివృద్ధి

జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రామిరెడ్డి

మామిడి రైతుల అవగాహన సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రైతు సంఘాలు ఏర్పాటు చేసుకోవడంతో ప్రభుత్వం రైతుల సంఘాలకు అధిక రాయితీలు ఇస్తుందని, తద్వారా రైతులు అభివృద్ధి చెందవచ్చునని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు పట్టణంలో స్థానిక అంబేద్కర్ భవనాల పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం, మండలం మామిడి రైతులకు మామిడి పర్యవేక్షణ పూత పిందెపై రక్షణ సదస్సు అన్నారు. పుత్తూరు ఉద్యానవన శాఖ అధికారి వెంకట సౌజన్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రామిరెడ్డి మాట్లాడుతూ రైతు సంఘాలకు ఉద్యానవన శాఖ నుండి రాయితీ 75 శాతం ద్వారా అందుబాటులో ఉన్నదంటే 15 లక్షల యూనిట్ ధరకు 11.25 లక్షల రాయితీ అందుబాటులో ఉందని రైతుల సంఘాలు ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చెందాలని తెలిపారు. అనంతరం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి మామిడి పూత పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి ఉత్పత్తిదారుల సంఘం ఛైర్మన్, ముని చంద్రనాయుడు, సీఈవో ఆనంద నాయుడు, రైతులు ఉద్యానవన సిబ్బంది పాల్గొన్నారు.

మా తెలుగుతల్లి వృద్ధాశ్రమం ప్రారంభం

వృద్ధులకు అల్పాహారాన్ని అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచాయ తీలో మా తెలుగుతల్లి వృద్ధాశ్రమాన్ని రిటైర్డ్ ఎస్పీ పిసి.స్వామి, గ్రామపంచాయతీ వైసీపీ ఇన్చార్జ్ గుండ్రాజు శివశంకర్ రాజు, మంగళం పంచాయతీ వైసిపి నాయకులు రాంబాబు, ఉపసర్పంచ్ బైరెడ్డి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ పిసి.స్వామి మాట్లాడుతూ తన తండ్రి చేపట్టిన సేవా కార్యక్రమాన్ని తదనానంతరం స్వీకరించి వృద్ధులకు సేవ చేయడానికి ముందుకు వచ్చిన మునిచంద్ర కుమారుడు గోపీని ప్రత్యేకంగా అభినందించారు. పంచాయతీ వైసిపి ఇన్చార్జ్ గుండ్రాజు శివశంకర్ రాజు మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం ఎంతో పుణ్యమని అలాంటి సేవా కార్యక్రమానికి, మా తెలుగు తల్లి వృద్ధాశ్రమానికి తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వృద్ధాశ్రమంలో 15 మంది వృద్ధులు ఉన్నారని వారికి వారి కుటుంబీకులు లేరన్న చింత లేకుండా కుటుంబ సభ్యులు లాగా చూసుకుంటున్నామని వృద్ధాశ్రమం ఉపాధ్యక్షులు మునిరత్నం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం అధ్యక్షులు టి.జయపాల్, కార్యదర్శి పి.ప్రియాంక, సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి బి.మునిరత్నం, ఈసి మెంబర్ చరణ్, మంగళం పంచాయతీ వార్డు మెంబర్లు దినేష్, గణేష్, వైసీపీ నాయకులు దయాకర్, నాని, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఆకేపాటి 20వ మహా పాదయాత్ర

తిరుమలకు పాదయాత్రగా వస్తున్న అమరనాథ్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైఎస్ఆర్ కడప జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి చేపట్టిన మహా పాదయాత్ర జనసందోహం మధ్య అన్నమయ్య కాలిబాటలోకి ప్రవేశించింది. ఆదివారం కడప-తిరుపతి మార్గంమధ్యలోని కుక్కలదొడ్డి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. అన్నమయ్య జన్మించిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి మాజీ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి టిటిడి సౌజన్యంతో అన్నమయ్య ఉత్సవాలను ప్రారంభించి, 108 అడుగుల ఎత్తుగల అన్నమయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటి నుండి ప్రతి ఏడు ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ఈ ప్రభుత్వంలోనే, ఈ పాలకమండలి ద్వారానే అన్నమయ్య కాలబాటను పునరుద్ధరించుకోవడానికి నిర్ణయం కూడా తీసుకోవడం జరిగిందన్నారు. ఆరోగ్యం సహకరించకపోయినా ప్రజల ఉత్సాహం పాదయాత్రలో నడిపిస్తోందన్నారు. ప్రతిఏడు లాగానే ఈ 20వ మహాపాదయాత్రకు డిప్యూటీ సీఎం అంజద్ బాషా, కొడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ప్రభుత్వ విప్ శ్రీకాంత్ రెడ్డి పాదయాత్రలో కలిసి నడిచారన్నారు. సీఎం జగన్ కృషితో రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి, వైసిపి నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలా కొండయ్య, కడప నగర కార్పొరేటర్ షఫీ, హాకీ అకాడమీ డైరెక్టర్ సుభాన్ బాషా, బాబు, ఎస్సి సెల్ ఛైర్మన్ గరుడాద్రి, ఆకేపాడు పిహెచ్ సి మెడికల్ ఆఫీసర్ అశ్విన్ చంద్ర, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కైలాస సదన్‌కు రూ.15 లక్షల విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా నిర్మిస్తున్న కైలాస సదన్ అతిథి గృహానికి హైదరాబాద్‌కు చెందిన వెంకట సత్య నారాయణ రాజు ఆదివారం రూ.15 లక్షలు విరాళం అందజేశారు. ఆ మొత్తాన్ని ఆయన చెక్కు రూపంలో ఆలయ పాలకమండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు అందజేసి సూట్‌రూమ్ నిర్మాణ ఖర్చులకు వినియోగించాల్సిందిగా కోరారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రతిభావంతులకు నెలసరి నిత్యాసరుకులు పంపిణీ చేశారు. క్యాన్సర్ వ్యాధి స్పెషలిస్ట్ డాక్టర్ ఆర్ముగం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ హెల్పింగ్ హాండ్స్ సేవలు 131వ నెలకు చేరుకోవడం అభినందనీయ మన్నారు. వారి సేవలు సుదీర్ఘకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. ఫిజియో థెరపిస్ట్ శీనప్ప, సంస్థ వ్యవస్థాపకుడు మునీర్ బాషా, రాజేశ్వరరావు, గరికపాటి రమేష్, హరి, ఢిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వర దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు సమీపంలోని బద్దెవోలు క్రాస్ రోడ్డు వద్ద వెలసియున్న కామాక్షితాయి సంగమేశ్వరుని ఆలయంలో ఆదివారం కుంకుమార్చన, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సాయికుమార్ శర్మ ఆధ్వర్యంలో పదిమంది అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరు బయట కల్యాణ మండపంలో శివలింగానికి భక్తులచే విడివిడిగా పాలాభిషేకం చేశారు. అనంతరం వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. గూడూరు, నెల్లూరుస, చెన్నూరు, సైదాపురం, నాయుడుపేట గ్రామాల నుంచి భక్తులు బారులు తీరారు. ఈ కార్యక్రమాలన్నిటికీ గూడూరు ఆర్యవైశ్య వర్తక బృందం ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అఖిల భారత సహకార సంఘం వార్షికోత్సవాలు

ప్రజాశక్తి-పిచ్చాటూరు: పిచ్చాటూరులో భారత సహకార వార్షికోత్సవాన్ని సింగిల్ విండో ఛైర్మన్ కెటి హరిశ్చంద్ర రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైనాన్షియల్ సర్వీసెస్, డిజిట లైజేషన్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా అందించి లాభాలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ముఖ్య నిర్వహణాధికారి ఎన్.దొరస్వామి, ఇన్‌ఛార్జి సభ్యులు పి.పురుషోత్తం రెడ్డి, కె.గోవిందన్, బ్యాంక్ మేనేజర్ యన్.విజయ భాస్కర్ రెడ్డి, సూపర్‌వైజర్ టి.వెంకటముని బాబు, కెజి సర్పంచ్ రోస్ రెడ్డి, మునిరాజా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కలిసిన సిఎస్‌పిఆర్

ప్రజాశక్తి-కోట: తిరుపతి జిల్లాలోని నాయుడుపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డీఎస్పీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డిని కోట మండలం చెందోడు పంచాయతీ యువ నాయకులు, వైసీపీ గూడూరు నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి నూతన డీఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభా కాంక్షలు తెలియజేశారు.

సౌత్‌జోన్ పోటీలకు..

ఎస్వీయూ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు మహిళల బ్యాడ్మింటన్ జట్టును ఎంపిక చేయడం జరిగిందని ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎం.శివ శంకర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌విఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ బెంగళూరులోని జైన్ యూనివర్సిటీలో నవంబర్ 21వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సౌత్ జోన్ మహిళల బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్వీయూ నుంచి క్రీడాకారులను ఎంపిక చేసి పంపడం జరిగిందన్నారు. విద్యార్థినిలు సౌత్ జోన్ పోటీలలో చక్కగా రాణించి కళాశాలకు, వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఫిజికల్ డైరెక్టర్ శివ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్. దీపిక, జి. సుస్మిత, బి. హేమలత, ఈ. శరణ్య, వీజే. కాశీ భాయ్‌లను బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు.

పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్, ప్రధానకార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీలో "సంక్షేమ హాస్టల్ పోరుబాట" పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొట్టే హేమంత్ రాయల్, అశోక్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో సంక్షేమ హాస్టల్ విద్యార్థులు పౌష్టిక, నాణ్యమైన ఆహారానికి దూరమయ్యారని అన్నారు. చాలీ చాలని మెస్ ఛార్జీలతో కడుపు మాడ్చుకుంటున్నారని, దుప్పట్లు లేక చలికి వణుకుతూ విద్యార్థుల ఆర్తనాదాలు పెడుతున్నా వైసీపీ ప్రభుత్వంలో కనీస చలనం లేదన్నారు. గత నాలుగు నెలలుగా మెస్ ఛార్జీల బిల్లులు రాకపోవడంతో వార్డెన్లు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నారు. ప్రభుత్వం వెంటనే మెస్ బిల్లుల బకాయిలను విడుదల చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ శ్రీకాళహస్తి నియోజకవర్గం అధ్యక్షులు లక్ష్మణ్, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు ఉపాధ్యక్షులు పరస బాబు తెలుగు యువత నాయకులు శేషాద్రి, రామ్మోహన్ టిఎన్ఎస్ఎఫ్ నాయకులు జ్ఞానేష్, గురవా పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని సబ్ జైల్లో ఉన్న ఖైదీలకు, సిబ్బందికి ఆదివారం ఉదయం సంకల్ప సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, న్యాయవాది ఎన్.రాజారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరమాదేవి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రమాదేవి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డా. డిబి. శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సంకల్ప సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్. రాజా రెడ్డి మాట్లాడుతూ ఖైదీలు, సిబ్బంది ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలన్నారు. డా. బీ. కిషోర్, డా.డి. మస్తానమ్మ, న్యాయవాదులు చంద్రయ్య, ఆశ, నరసింహులు, రేహనా, ఆప్స్ జిల్లా అధ్య క్షులు షేక్ మహ్మద్ రఫీ, బాలాజి, పెదరాయుడు, జైల్ సిబ్బంది, హాస్పి టల్ సిబ్బంది పాల్గొన్నారు. ఖైదీలకందరికి ఉచితంగా షుగర్, బీ పీ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇచ్చారు.

కేంద్రీకృత పాలనతో నష్టపోయాం

ఎస్‌కె బాబు ధ్వజం

ప్రజాశక్తి -తిరుపతి(మంగళం): కేంద్రీకృత పాలన వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజల ధనంతో నిర్మించిన హైదరాబాదు రాజధాని నుండి బలవంతంగా నెట్టబడ్డామని, నేడు సీఎం జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానులతో మూడు ప్రాంతాలను సమాన అభివృద్ధి చేయడానికి పూనుకుంటే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడ్డుకట్ట వేస్తున్నారని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ ఎస్ కె బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలులో న్యాయ రాజధాని కావాలని విద్యార్థి సంఘాలు, న్యాయవాదులు తమ నిరసనను తెలియజేస్తుంటే అక్కడి పర్యటనలో ఉన్న చంద్రబాబు నాయుడు వారిపై పరుష పదజాలాలు ఉపయోగించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. జగన్ పాలన చూడడానికైనా చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, టౌన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ వాసు యాదవ్, దుద్దేల బాబు, బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్, సూరి, సుధాకర్, బాబు పాల్గొన్నారు.

ఆవాస్ దివాస్‌పై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి- డక్కిలి: మండలంలోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న ఇంటి స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం లింగసముద్రం పంచాయతీలలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం హౌసింగ్ డే, ఆదివారం ఆవాస్ దివాస్ రోజు సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఐక్యతతో ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరే విధంగా అభివృద్ధి బాటలోకి పయనిస్తుందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు అందరూ త్వరితగిన ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు వాయిదాల పద్ధతిలో నిర్మాణ లబ్ధిదారుల అకౌంట్లోకి జమ చేయబడుతుందన్నారు. తహశీల్దార్ పద్మావతి మాట్లాడుతూ మండలంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి అవకాశం ఉన్న అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇల్లు లేకుండా ఉన్నవారు తహశీల్దార్ కార్యాలయానికి నివేదికల సమర్పించాలన్నారు. సచివాలయ పరిధిలో విలేజ్ రెవెన్యూ అధికారి అందుబాటులో ఉంటారని ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. హౌసింగ్ శాఖ ఏఈ, వెంకటేశ్వర్లు వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ అశోక్, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, వాలంటీర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో..

ఓవరాల్ ఛాంపియన్ చిత్తూరు

ప్రజాశక్తి - రేణిగుంట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో ఆదివారం రెండవ స్టేట్ మీట్ ఘట్కా బాలికల జూనియర్ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిశాయని ఏపీ ఘట్కా అసోసియేషన్ ప్రెసిడెంట్ రేఖా రాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిత్తూరు జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారు. ద్వితీయ స్థానంలో కడప జిల్లా జట్టు, తృతీయ స్థానంలో తూర్పుగోదావరి జిల్లా జట్లు కైవసం చేసుకున్నాయి. అలాగే 32 మంది బాలికలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వీరు డిసెంబర్ 24, 25, 26 తేదీలలో చండీఘడ్‌లో జరిగే 10వ జాతీయస్థాయి ఘట్కా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సురేందర్ రెడ్డి, మురళి, మణికంత, వంశి, రోహిణి, లోకేష్‌లు పాల్గొన్నారు.

ప్రతి బుధవారం బాల కార్మికుల తనిఖీలు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: తిరుపతి ఉపకార్మిక కమిషనర్ ఎం.బాలు నాయక్, సహాయ కార్మిక కమిషనర్ కే.ఓంకార్ రావు వారి ఆదేశాల మేరకు పుత్తూరు ప్రతి బుధవారం బాల కార్మికుల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని పుత్తూరు సహాయ కార్మిక అధికారి కె హేమాచారి అన్నారు. దుకాణాలు, సంస్థలు, ఫ్యాక్టరీలు లోక్ బాల కార్మికులతో పని చేయించుకుంటే యజమాని మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.